# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వము

పత్రికా ప్రకటన-4 తేదిః 22.9.2014.

కృష్ణా, గోదావరి నదీ జలాల పంపిణీలో తెలంగాణకు జరిగిన కుట్ర పూరిత అన్యాయాన్ని సవరించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు కోరారు. సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఛైర్మన్ ఎస్‌కె.పండిట్, గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఛైర్మన్ ఎమ్మెస్.అగర్వాల్‌తో సమావేశమయ్యారు. నీటి పారుదల శాఖ మంత్రి టి.హరీష్‌రావు, నీటి పారుదల కార్యదర్శి ఎస్‌కె.జోషి, రెండు బోర్డుల మెంబర్ సెక్రటరీలు ఆర్‌కె.గుప్త, జేఎస్.చంద్రశేఖర్ అయ్యర్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. కృష్ణా, గోదావరి నదులపై నిర్మించిన అన్ని ప్రాజెక్టులకు ఆపరేషన్ రూల్స్ తయారు చేసి అమలు చేయాలని ముఖ్యమంత్రి వారిని కోరారు. కృష్ణా,గోదావరి నదులపై నిర్మించిన ప్రాజెక్టుల గేట్లు, కాలువలకు నీటి విడుదల తదితర కార్యక్రమాలను ప్రభుత్వాలు కాకుండా బోర్డులే నిర్వహించాలని కోరారు. సిఐఎస్‌ఎఫ్ జవాన్లతో భద్రత ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. హైదరాబాద్‌తో సహా అన్ని నగరాలు, పట్టణాలు, ప్రాంతాలకు మంచినీటి కోసం కేటాయింపులు జరిపిన తరువాతే మిగతా అవసరాల కోసం కేటాయింపులు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. హైదరాబాద్‌కు 50 టిఎంసిల నీరు మంచినీటి కోసం కేటాయించారన్నారు. కృష్ణా నదిపై కట్టిన ప్రాజెక్టులు, వాటి పూర్తి స్వరూపాన్ని అర్థం చేసుకోవడానికి బోర్డు అధికారులు విస్తృత పర్యటన చేయాలని, హెలికాప్టర్ ద్వారా కూడా పర్యటన జరిపితే వాస్తవాలు కళ్లకు కట్టినట్లు కనిపిస్తాయని ముఖ్యమంత్రి చెప్పారు. అధికారుల పర్యటనకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హెలికాప్టర్ సమకూరుస్తుందని చెప్పారు.

సమైక్య రాష్ట్రంలో కృష్ణా, గోదావరి నీటి కేటాయింపులు, పంపిణీ, వినియోగం విషయంలో తెలంగాణకు పూర్తి స్థాయి అన్యాయం జరిగిందని ముఖ్యమంత్రి బోర్డు అధికారుల

దృష్టికి తెచ్చారు. సీమాంధ్ర ప్రజలకు ఉపయోగపడే ప్రాజెక్టులను నిర్మించుకుని తెలంగాణకు ఉపయోగపడే ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని చెప్పారు. నిజాం సాగర్‌తో పాటు కాకతీయులు నిర్మించిన గొలుసుకట్టు చెరువుల ద్వారా తెలంగాణలో 20 లక్షల ఎకరాలు సాగయ్యేదని, కాని సీమాంధ్ర పాలకులు చూపిన నేర పూరిత నిర్లక్ష్యం వల్ల చెరువులు నాశనమయ్యాయని అన్నారు. బడ్జెట్లలో ఒక్క రూపాయి కూడా చెరువుల కోసం కేటాయించని సందర్భాలు ఎన్నో వున్నాయని సిఎం ఆవేదన వ్యక్తం చేశారు. చిన్ననీటి వనరులకు నీరు అందించడం కోసం కృష్ణా నదిలో 90 టిఎంసిలు, గోదావరిలో 175 టిఎంసిల కేటాయింపులు ఉన్నప్పటికి వాటిని వినియోగించుకోలేదని చెప్పారు. అందుకే తమ ప్రభుత్వం చెరువుల పునరుద్ధరణకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చినట్లు వెల్లడించారు. తెలంగాణ ప్రాజెక్టుల సాధన కోసం తెలంగాణ ప్రజలు ఎన్నో ఉద్యమాలు చేయాల్సి వచ్చిందని అయినా న్యాయం జరుగులేదన్నారు. కృష్ణా, గోదావరి నదీ ప్రవాహం 70 శాతానికి పైగా తెలంగాణలోనే వుంటుందని అయినా నీటి వాడకం మాత్రం అలా లేదని చెప్పారు. హైదరాబాద్ రాష్ట్రంలోనే అప్పటి నిజాం ప్రభుత్వం నందికొండ ప్రాజెక్టుకు రూపకల్పన చేసిందని, దీని ద్వారా హైదరాబాద్ రాష్ట్రానికి 180 టిఎంసిలు, మద్రాసు రాష్ట్రానికి 60 టిఎంసిలు కేటాయించారని అన్నారు. అయితే సమైక్య రాష్ట్రం ఆవిర్భవించిన తరువాత కె.ఎల్.రావు అనే కాంట్రాక్టర్ చేసిన నిర్వాకం వల్ల తెలంగాణకు నష్టం జరిగిందని చెప్పారు. నందికొండ ప్రాజెక్టు ప్రతిపాదిత స్థలం కన్నా 19 కిలో మీటర్ల దిగువన నాగార్జునసాగర్ నిర్మించారన్నారు. కుడి, ఎడమ కాలువల డిజైన్లలో కూడా పక్షపాతం చూపించారని, ఆంధ్రకు నీళ్లను సులభంగా తరలించుకుపోయేలా కాలువలు నిర్మించారన్నారు. దీనికి ప్రతిఫలంగా ఆంధ్ర ప్రజలు కెఎల్.రావును విజయవాడ ఎంపిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని కూడా ముఖ్యమంత్రి చరిత్రను విడమరచి చెప్పారు. తెలుగు గంగ కన్నా ముందే ఎస్ఎల్‌బిసికి రూపకల్పన జరిగినా, తెలుగు గంగ ఆగమేఘాల మీద పూర్తి చేశారని, ఎస్ఎల్‌బిసిని నిర్లక్ష్యం చేశారని చెప్పారు. భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు లాంటి కృష్ణా

ప్రాజెక్టులు, ఇచ్చంపల్లి, దేవనూర్, కంతనపల్లి లాంటి గోదావరి ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుకోవడానికి వున్న కొన్ని ముఖ్య కారణాల్లో జల దోపిడి కూడా ప్రధానమైనదని వెల్లడించారు. తెలంగాణ ఉద్యమ ట్యాగ్‌లైన్‌లో మొదటిదే నీళ్ల అంశమని వెల్లడించారు. హైదరాబాద్ నగరానికి కృష్ణా నీళ్లు రావలసి వున్నా ఆ విషయం పట్టించుకోలేదని, కృష్ణా బేసిన్‌లో వున్నా సింగూర్ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటిని హైదరాబాద్ కోసం తరలించాల్సి వచ్చిందని వెల్లడించారు. నీటి పంపిణీలో ఆంధ్ర వాళ్ల పెత్తనమే ఎక్కువ కావడంతో తాము నిస్సహాయ పరిస్థితిని ఎదుర్కోవలసి వచ్చిందని చెప్పారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రం ఏర్పడినందున తమ అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టులను నిర్మించుకుంటున్నమని వాటికి కేటాయింపులు జరపాలని అభ్యర్థించారు. పాలమూరు ఎత్తిపోతల పథకం ద్వారా హైదరాబాద్ నగరానికి మంచినీరు అందించుకునే ఆలోచన వుందన్నారు. తెలంగాణ ప్రజలు నీటి కోసం పోరాటాలు చేశారని, కాని మిగిలింది కేసులు, పిడి యాక్టులు, జైలు శిక్షలు మాత్రమేనని ఆవేదన వ్యక్తం చేశారు. అదే ఆంధ్రకు నీళ్లు, నిధులు, ప్రాజెక్టులు, పంటలు, సిరులు అంతిమంగా అధికారం దక్కిందని చెప్పారు. రెండు బోర్డులకు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని, నిర్వహణ కోసం ఒక్కో బోర్డుకు తక్షణం రూ. 5 కోట్ల చొప్పున ఇస్తామని ముఖ్యమంత్రి హామినిచ్చారు.

---

సిపిఆర్ఓ టు సిఎం